నేడు సిఎం పోలవరం పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - ఏలూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల ఆరో తేదీ పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం ఉదయం 9.30కి తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరతారు. 10.20 గంటలకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని హెలీప్యాడ్‌కు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. 10.30 వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులతో మాట్లాడతారు. తర్వాత పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వెళ్తారు. 11.50కు తిరిగి అక్కడ నుంచి బయల్దేరి సమావేశ మందిరానికి చేరుకుంటారు. 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ అధికారులు, ప్రజాప్రతినిధులు, నిపుణులతో పనులపై సమీక్షిస్తారు. అనంతరం ఒంటి గంటకు బయల్దేరి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ అరగంటసేపు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. 1.40కు అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో బయల్దేరి 2.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి సిఎం చేరుకుంటారు.

చేప పిల్లల కథేమిటో..!

పంచాయతీ చెరువుల చుట్టూ మొగల్లు రాజకీయం
అంతటా అవినీతిమయం, అవకతవకలు
ఇఒపిఆర్‌డి విచారణతో వాస్తవాలు వెలుగులోకి
పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు
పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - పాలకోడేరు

అనగనగా ఒక ఊరు ఉంది.. ఆ ఊర్లో రెండు పంచాయతీ చెరువులు ఉన్నాయి.. ఆ చెరువుల్లో పంచాయతీ అధికారి, సర్పంచి, కొంతమంది వార్డు సభ్యులు చేపలు వేశారు. అయితే ఆ చెరువుల్లో వేసిన కొన్ని చిన్న చేపలు కన్పించినప్పటికీ 600 పెద్ద చేపలు కనిపించట్లేదు. చెరువులో వేసిన పెద్ద చేపలు ఏమయ్యాయో.. ఎక్కడికి వెళ్లాయో ఎవరికీ తెలియదు. అయితే ఈ చేపలు కొనుగోలు చేసి చెరువులో వేసినందుకు రూ.లక్షా ఐదు వేలు పంచాయతీ నిధుల నుంచి బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశారు. ఆ బ్యాంక్ ఖాతా మరెవరిదో కాదు.. సాక్షాత్తూ ఆ ఊరి పంచాయతీ కార్యదర్శిది కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆ ఊరి రాజకీయం పంచాయతీ చెరువుల చుట్టూ తిరుగుతోంది.

మొగల్లులో ఊర మంచినీటి చెరువు, సుబ్బరాజు చెరువులు పంచాయతీ ఆధీనంలో ఉన్నాయి. ఈ రెండు చెరువులకు చేపల పాటల ద్వారా ఆదాయం సమకూరుతోంది. అయితే గతేడాది సెప్టెంబర్ 16న ఒక్కొక్కటి రూ.3 చొప్పున 15 వేల చిన్న చేపలు రూ.45 వేలు విలువ చేసే చేపలు, మరో 600 చేపలు ఒక్కొక్కటి రూ.వంద చొప్పున రూ.60 వేలు మొత్తం రూ.1,05,000 విలువైన చేపలు వేసినట్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకట్రాజు, సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారితోపాటు మరికొంతమంది వార్డు సభ్యులు గతేడాది నవంబర్ రెండో తేదీన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో పెట్టి తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో వార్డు సభ్యులు పెన్మెత్స వెంకట్రాజు, పెన్మెత్స బలరామరాజుతోపాటు మరికొంతమంది వార్డు సభ్యులు, కొంతమంది గ్రామస్తులు అసలు ఈ రెండు చెరువుల్లో అసలు చేపలు వేయకుండానే రూ.లక్షా ఐదు వేలు స్వాహా చేశారని, ఈ ఏడాది మార్చి 25న ఎంపిడిఒ మురళీగంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించాలని ఇఒపిఆర్‌డి రెడ్డియ్యకు ఎంపిడిఒ ఆదేశాలు జారీ చేశారు. ఇఒపిఆర్‌డి దీనిపై గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టి ఫిర్యాదు చేసిన వారితోపాటు పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, మరికొంతమంది నుంచి వివరాలు తీసుకున్నారు. దీనిపై ఏప్రిల్ 29న ఎంపిడిఒకు నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా ఎంపిడిఒ కె.వెంకట్రాజుకు మే నాలుగో తేదీన ఛార్జిమెమో జారీ చేయడంతోపాటు సంజాయిషీ కోరుతూ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారికి కూడా నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచితోపాటు మరికొంతమంది వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదు అంశాలు అవాస్తవమని, గ్రామంలో ఎంతో అభివృద్ధి చేయడంతోపాటు సీసీ రోడ్లు నిర్మించామని, అవినీతి అనే దానికి ఆస్కారం లేదని, పంచాయతీలో నిధులు కూడా నిల్వ ఉన్నాయని ఎంపిడిఒకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అయితే ఎంపిడిఒ ఇఒపిఆర్‌డి సమర్పించిన నివేదిక ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారికి గత నెల 26న నివేదిక సమర్పించారు.

పంచాయితీ కార్యదర్శి ఖాతాకు రూ.1,14,500 జమ

వాస్తవానికి పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులతోపాటు ఇతర ఖర్చులు చేసిన పనులకు సంబంధిత కాంట్రాక్టర్, లేదా సంబంధిత యాజమాన్యాలకు చెల్లింపులు చేయాలి. అయితే మొగల్లు పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి వెంకట్రాజు బ్యాంక్ ఖాతాకు సొమ్ము మళ్లించుకున్నారు. సుబ్బరాజు చెరువు ఫిల్టర్ బెడ్‌లో సిల్టు తొలగింపు, చెరువు రేవు శుభ్రపర్చడం, ఒహెచ్ఆర్ ట్యాంక్ శుభ్రత, ఊర్లో టాం..టాం వేసే నిమిత్తం రూ.9,400, చెరువులో చేప పిల్లలు వేసేందుకు రూ.1,0,500 కలిపి మొత్తం రూ.1,14,500 సిఎఫ్ఎంఎస్ ఐడి 14104127 ద్వారా కార్యదర్శి వెంకట్రాజు ఎస్‌బిఐ భీమవరం బ్రాంచి బ్యాంక్ ఖాతా 30921632351కు జమ చేసుకోవడం జరిగింది. పంచాయతీరాజ్ చట్టప్రకారం ఇది పూర్తి విరుద్ధమైనప్పటికీ కార్యదర్శి ఇదేమీ లెక్క చేయకుండా తన సొంత ఖాతాకు పంచాయతీ సొమ్మును జమ చేసుకోవడం పలు అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది.



పంచాయితీ కార్యదర్శి తన ఖాతాకు జమ చేసుకున్న వివరాలు పట్టిక

ఇఒపిఆర్‌డి విచారణతో వాస్తవాలు వెలుగులోకి

కొంతమంది పంచాయతీ వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదులో భాగంగా ఏప్రిల్ నాలుగో తేదీన ఇఒపిఆర్‌డి రెడ్డియ్య విచారణ చేపట్టారు. దీంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది సెప్టెంబర్‌లో చేప పిల్లలు వేస్తే నవంబర్ 2న పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకొచ్చి అడ్డగోలు తీర్మానం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. చెరువులో వేసినట్లు చెబుతున్న 15 వేల చిన్న చేపలు పూర్తిస్థాయిలో లేవని తేల్చారు. చెరువులో వేశామని చెబుతున్న 600 పెద్ద చేపలు అసలు చెరువులోనే లేవని విచారణలో వెల్లడైంది. పంచాయతీలో చేసిన పనులకు కార్యదర్శి బ్యాంక్ ఖాతాకు డబ్బు జమ చేయకూడదని, ఇవన్నీ పూర్తి విరుద్ధంగా జరిగాయని నిర్ధారించారు.

పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

మొగల్లు పంచాయతీలో అవకతవకలు, కార్యదర్శిపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలపై సాక్షాత్తూ పంచాయతీ పాలకవర్గ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. గత మార్చి 25న ఫిర్యాదు చేస్తే మూడు నెలలుగా ఉన్నతాధికారులు ఉదాశీన వైఖరి అవలంబించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మండల అధికారులు గత మే 26న డిపిఒకు నివేదిక పంపినా ఇప్పటికీ సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం విస్మయం కల్గిస్తుందని వార్డు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామ రాజకీయం మొత్తం ఈ చెరువు చుట్టూనే తిరుగుతోంది. పరస్పర ఆరోపణలతో ప్రశాంతంగా ఉన్న గ్రామం వివాదాలకు నిలయంగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయతీలో నెలకొన్న అవినీతిని అరికట్టేలా చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన

పెరుగులంక భూముల్లోనే నిద్రించిన ఎంఎల్ఎ నిమ్మల, సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ఆందోళనకారులకు భోజనం వడ్డిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి

ఏనుగువానిలంక పరిధిలో చించినాడ దళితులు, పేదల సాగులో ఉన్న గోదావరి పెరుగులంక భూముల్లో అధికారుల తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం, ప్రజాసంఘాలు చేపట్టిన ఆందోళన ఉధృతమైంది. ఇప్పటికే తవ్వకాలకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన చేసిన ఆందోళనకు పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బాసటగా నిలిచారు. భూముల్లో తవ్వకాల వల్ల తాము పడుతున్న ఇబ్బందులను పేదలు సిపిఎం ఆధ్వర్యాన ఎంఎల్ఎ రామానాయుడుకు ఆదివారం వివరించిన సంగతి తెలిసింది. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ సోమవారం ఉదయం ఆ భూముల్లోకి ర్యాలీగా వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. అక్కడినుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పేదల భూముల్లో తవ్వకాలు సరికాదని పైగా పర్యావరణానికి విఘాతం కలిగించే తగవని అన్నారు. తక్షణ తవ్వకాలు ఆపకపోతే తానే ప్రత్యేక్షంగా అడ్డుకుంటానని హెచ్చరించారు. పోలీసుల బందోబస్తు నడుమ తవ్వకాలు ఏంటని నిలదీశారు. ఇదిలాఉండగా రాత్రి సమయంలో తవ్వకాలకు జెసిబిలు, టిప్పర్లు వస్తున్నాయనే సమాచారంతో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎంఎల్ఎ రామానాయుడు స్వయంగా సిపిఎం, ప్రజాసంఘాల నేతలు పేదలతో కలిసి పెరుగులంక భూముల్లోకి చేరుకున్నారు. అక్కడే రాత్రి భోజనం చేసి నిద్రచేశారు. అర్ధరాత్రి వేళ తవ్వకాలు పూనుకుంటే అడ్డుకుని తీరతామని, దీనివల్ల ఏర్పడే శాంత్రిభద్రతల సమస్యకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

లంకభూముల్లో నిద్రిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్

ప్రజాశక్తి - మొగల్తూరు

మానవ మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉందని, దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పేరుపాలెం బీచ్‌లో పర్యావరణంపై రూపొందించిన సందేశాత్మక సైకత శిల్పాన్ని ఆమె తిలకించారు. అనంతరం పర్యావరణానికి హాని కలిగించే చర్యలను చేయబోమని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సంబంధిత శాఖలు అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, స్థానిక ప్రజానీకం సహకారంతో లైఫ్‌స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే ఒక క్యాంపెయిన్‌ను ప్రారంభించి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పర్యావరణ సమతుల్యత పెంపొందించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ఈ భూమి మీద నివశిస్తున్న ప్రతిఒక్కరి బాధ్యతని ఆమె అన్నారు. మానవాళి జీవన విధానాలను కొంతవరకు మార్పులు చేసుకుంటే కాలుష్యాన్ని నివారించవచ్చని ఆమె అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, విద్యుత్ వినియోగం బదులుగా సోలార్ పవర్ వినియోగం, పెట్రోల్ వినియోగం తగ్గించుకోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించడం, అవసరాల మేరకు విద్యుత్ వినియోగించుకోవడం వంటి అంశాలపై ప్రజలు దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఇక్కడితోనే వదిలేయకుండా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. పర్యావరణానికి మంచి జరిగే పనులు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పీల్చే గాలి, తాగే నీరు, పండించే పంట భూమి కలుషితమైతే మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండదని అన్నారు. ఎస్‌పి యు.రవిప్రకాష్ మాట్లాడుతూ భూమిని కాలుష్యం నుంచి కాపాడుకునేందుకు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించారన్నారు. పర్యావరణానికి హాని తలపెట్టే పనులు మానుకొని పర్యావరణానికి మంచి తలపెట్టే దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ తాము అధికార యంత్రాంగంతో సముద్ర తీరాన్ని సందర్శించినప్పుడు తీరం వెంబడి ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించేవని, వాటిని తొలగించి తీర ప్రాంతాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన వారిని బృందాలుగా విభజించి వారికి గన్ని బ్యాగులు, బాంబు కర్రలు ఇచ్చి నాలుగు కిలోమీటర్ల మేర తీరప్రాంతంలో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ స్టూడెంట్ ఎవర్నెస్ ఆర్గనైజేషన్ వారి కళాకారుల బృందం సభ్యుల కళాజాతా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సైకత శిల్పి బాలాజీ రూపొందించిన సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంది. ఆయా కార్యక్రమాల్లో ఎపిపిబిసి ఇఇ వెంకటేశ్వర్లు, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, డిఎస్‌పి రవి మనోహరాచారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వాకపల్లి ప్రసాద్, అటవీ శాఖాధికారి ఎమ్‌డి.అబ్దుల్ భరి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తహాశీల్దార్లు జి.అనితకుమారి, ఎస్ఎం.ఫాజిల్, సిహెచ్.పెద్దిరాజు, గురుమూర్తి, ఎంపిడిఒలు ఎన్‌విఎస్.ప్రసాద్ యాదవ్, సంగాని వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.నవీన్‌కిరణ్, స్వచ్ఛంద సేవా సంస్థలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రసాదరాజు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించి కేన్సర్‌ను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ సమతుల్యత పెంపొందించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ఈ భూమి మీద నివశిస్తున్న ప్రతి మానవుని బాధ్యత అని ఆయన అన్నారు. పీల్చే గాలి, తాగే నీరు, పండించే పంట భూమి కలుషితమైతే మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశాన్ని ప్రతిఒక్కరూ అర్థం చేసుకుని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, సర్పంచి దొండపాటి వెంకటేశ్వరరావు, దొంగ మురళీకృష్ణ, జెవిఆర్ పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

బీచ్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఇతర అధికారులు

జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రాష్ట్ర జాతాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత బి.సోమయ్య

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ కార్మికులకు జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 30న శ్రీకాకుళంలో ప్రారంభమైన రాష్ట్ర జాతా సోమవారం తాడేపల్లిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులనుద్దేశించి సోమయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభకు యూనియన్ జిల్లా నేత కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ధనాల వెంకట్రావు, పి.నూకరాజు, జి.లక్ష్మి, జి.నాయుడు, ధనాల దానయ్య, కొడమంచిలి బాబు, కె.దయామణి, టి.భాను, జి.మిస్సమ్మ, ఎస్.సతీష్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

సమస్యకు పూర్తి పరిష్కారమే 'స్పందన' లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

అర్జీదారుని సమస్యకు పూర్తి పరిష్కారం లభించినప్పుడే 'స్పందన' కార్యక్రమానికి సరైన అర్థం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ డివిజన్, మండల స్థాయిలో స్పందన దరఖాస్తులు స్వీకరించేవారు అర్జీదారుని సమస్యను ఓర్పుతో విన్నప్పుడే సరైన పరిష్కారాన్ని చూపగలమన్నారు. స్పందన దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో అర్జీదారుని స్థానంలో మనం ఉంటే అనే ఆలోచనతో వ్యవహరించాలన్నారు. నిర్ణీత సమయంలో అర్జీకి సరైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ సూచించారు. స్పందనలో 183 అర్జీలను స్వీకరించామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎస్‌పి బి.శ్రీనాథ్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అతిసారపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అతిసార వ్యాధి నుండి ఎలా రక్షణ పొందాలనే అంశాలపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు ఆవిష్కరించారు.

ఎలక్ట్రిక్ చేతక్‌ను లాంచ్ చేస్తున్న నర్సింహారాజు

ఎలక్ట్రిక్ చేతక్ షోరూమ్ ప్రారభం

వాహనాన్ని లాంచ్ చేసిన జివి.నరసింహారాజు

ప్రజాశక్తి - భీమవరం

ఎలక్ట్రిక్ స్కూటర్ రంగంలో ప్రముఖ తయారీ సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్ భీమవరంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ స్కూటర్ల ఆథరైజ్ చేతక్ షోరూమ్‌ను సోమవారం ప్రారంభించింది. ఉండి రోడ్లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు గోకరాజు వెంకట నర్సింహారాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో మొట్టమొదటిసారిగా షోరూమ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. తక్కువ మెయింటినెన్స్, కాలుష్య రహితమైన ఎలక్ట్రికల్ వాహనాలు అందరికీ అనువుగా ఉంటాయని చెప్పారు. నూతనంగా ఏర్పాటైన షోరూం మరింత అభివృద్ధి చెంది ఎలక్ట్రికల్ రంగంలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పివి.సత్యనారాయణ మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న పెట్రోల్ ధరల కారణంగా ఎక్కువ మంది నేడు ఎలక్ట్రికల్ వాహనాలపై ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎన్నోఏళ్ల నుంచి వరుణ్ బజాజ్ ఖాతాదారుల సేవలో మమేకమై ఉందన్నారు. వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎలక్ట్రికల్ రంగంలో కొత్త ఉత్పత్తులను తీసుకొచ్చి వాహనదారులకు చేరువ చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర చేతక్ సర్వీస్ మేనేజర్ అరుణ్‌కుమార్, వెంకటేష్‌న్ మాట్లాడుతూ మెటల్ బాడీతో ఉన్న ఏకైక వాహనం చేతక్ 2413 అని అన్నారు. మారియో మార్కెట్‌లో మంచి ఫీచర్స్‌తో ఉన్న ఎలక్ట్రిక్ వాహనమని తెలిపారు. ఈ కారక్రమంలో చేతక్ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సిఐటియు నివాళి

ప్రజాశక్తి - భీమవరం

కోరమండల్ రైలు ప్రమాదంలో మృతులకు సిఐటియు జిల్లా కమిటీ నివాళులర్పించింది. జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద కొవ్వొత్తులతో సంతాపం ప్రకటించింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదంలో అమాయక ప్రజలు మృతి చెందారని, వందలాదిమంది క్షతగాత్రులయ్యారని, వారందరికీ తగిన వైద్యం, నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదానికి ప్రధాన కారణం ప్రభుత్వం రైల్వేలను ప్రయిటీకరించడం, లైన్లు, స్టేషన్లు వంటి వాటిని కూడా ప్రయివేట్‌కి అప్పగించాలని చూడటం వల్లే ఇలాంటి ప్రమాదాలకు అవకాశం ఏర్పడిందని అన్నారు. ముఖ్యంగా సిగ్నలింగ్ వ్యవస్థలో ఉద్యోగులను తగ్గించడం, ట్రాక్ మీద పనిచేసే కార్మికులను తగ్గించడం వాటి వల్ల ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రయివేటీకరణ విధానాలను మానుకుని కార్మికులను పెంచి, రైల్వేలో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణాలు సక్రమంగా అన్వేషించకుండా పక్కదారి పట్టించే పద్ధతుల్లో మాట్లాడటం సరైంది కాదని, ప్రభుత్వం వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపించి ప్రయాణికులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కర్రి నాగేశ్వరరావు, బి.సోమయ్య, వరలక్ష్మి, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, త్రిమూర్తులు, రాజు, అప్పన్న పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

వల్లూరులో డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని వల్లూరు పభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రోన్ కెమెరా ద్వారా భూ రీసర్వే కార్యక్రమాన్ని ఎంపి ఛైర్‌పర్సన్ చిల్లే లావణ్య, గ్రామ సర్పంచి నేలపూడి బేబీరామ్మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి ఛైర్‌పర్సన్ చిల్లే లావణ్య మాట్లాడుతూ మండలంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వేను మూడు ఫేజ్‌ల్లో చేపట్టగా ఫేజ్-2లో ఐదు గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని వల్లూరు, పెనుమంచిలి, కరుగోరుమిల్లి, ఆచంట వేమవరం, భీమలాపురం గ్రామాల్లో ఉండే వ్యవసాయ, ప్రభుత్వ, ప్రయివేట్ భూములను రీసర్వే చేసి రికార్డును ఆధునికీకరిస్తారన్నారు. సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పత్రాలను అందించే కార్యక్రమాన్ని త్వరలోనే చేపడతామని తహాశీల్దార్ డి.దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జివివి.సత్యనారాయణ, విఆర్ఒలు డిఎన్‌వి.చలం, కె.నాగేశ్వరరావు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న లావణ్య

వెబ్ ఆప్షన్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపీమూర్తి

బదిలీల వెబ్ ఆప్షన్ కేంద్రం ప్రారంభం

యుటిఎఫ్ కార్యాలయంలో ప్రారంభించిన రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి వెబ్ ఆప్షన్ కేంద్రాన్ని యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి సౌకర్యార్థం ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కార్యదర్శులు కెఎస్.రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇ-షిప్ నమోదు కోరుతూ ఆక్వా రైతుల ధర్నా

ప్రజాశక్తి - కాళ్ల

మత్స్య శాఖ అధికారులు ఇ-షిప్‌లో తమను నమోదు చేయకపోవడంతో విద్యుత్ సబ్సిడీ పొందలేకపోతున్నామని, అధిక మొత్తంలో బిల్లులు చెల్లించడం ఎలా సాధ్యమంటూ ఆక్వా రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు మాట్లాడుతూ మండలంలో 180 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ తొలగించి, అధిక విద్యుత్ బిల్లులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఆక్వా రైతుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఫిషరీస్ అధికారులు ఇ-షిప్ నమోదు చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని, ఇప్పుడు బిల్లుల సొమ్ము కట్టడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇ-షిప్‌లో నమోదు కాలేదనే సాకుతో విద్యుత్‌పై సబ్సిడీ తొలగించి ఛార్జీల మోత మోగించడం దారుణమన్నారు. గతంలో సబ్సిడీ పోను రూ.10 వేల నుండి రూ.40 వేలు వచ్చే విద్యుత్ బిల్లులు ప్రస్తుతం రూ.80 వేల నుండి రూ.లక్షా 50 వేలు వరకూ వచ్చాయన్నారు. మండలంలో సుమారు 180 మంది రైతులకు ఈ విధంగా అధిక విద్యుత్ బిల్లులు వచ్చాయని, దీనిపై విద్యుత్ శాఖాధికారులను వివరణ కోరగా అది తమ పరిధి కాదని, ఫిషరీస్ అధికారులు ఇ-షిప్ నమోదు చేయకపోవడం వల్లే అధిక బిల్లులు వచ్చాయని తెలిపారు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే 180 మంది రైతులకు ఇ-షిప్ నమోదు చేసి, తొలగించిన విద్యుత్ సబ్సిడీలను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ధర్నా అనంతరం తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, విద్యుత్ శాఖ ఎఇ పి.రాంబాబులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు కొప్పర్తి శివాజీ, ఆరేటి రంగారావు, దేశంశెట్టి మధు, కొల్లి శ్రీను, కందులపాటి వీరరాఘవులు, రాజనాల వాసు, తోట శివ, కొల్లి సోమేంద్ర, జెట్టిబోయిన సత్యనారాయణ, కాగిత వెంకట్రావు, ఉడతల సత్యనారాయణ, కొల్లి మురళీ, కొల్లి శివసత్యనారాయణ, జనసేన నాయకులు ఎరుబండి రామాంజనేయులు, రాజేష్, రాము, జగన్, సత్యనారాయణ, ఆరేటి దిలీప్, సతీష్, మధు, నాని,లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి చేసి చూపిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రూ.12 లక్షల వానపల్లి విజయలక్ష్మి ఇంటి నుంచి చెన్నూరి శివ బ్రహ్మం ఇంటి వరకు, నెల్లూరు సత్యనారాయణ ఇంటి నుంచి శంక ప్రభాకర్ ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రూ.16 లక్షలతో కొవ్వాడ పుంత మెయిన్ రోడ్డు వినాయక నగర్ నుంచి ప్రసన్న సతీష్ ఇంటి వరకు నిర్మించిని సీసీ రోడ్డును, రూ.12 లక్షలతో బైపాస్ రోడ్డు టెలిఫోన్ కాలనీ వద్ద నుంచి కొండేపూడి త్రిమూర్తులు ఇంటి వరకు, బైపాస్ రోడ్డు టెలిఫోన్ కాలనీ వద్ద నుంచి సయ్యద్ ఆయుబ్ ఇంటి వరకు నిర్మించి సీసీ రోడ్లను ప్రారంభించారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో ఎండ తీవ్రత ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తీవ్ర వడగాల్పులు, ఉష్ణోగ్రతలతో ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. సోమవారం ఉదయం మబ్బులతో వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం నుంచి ఉష్ణోగ్రత పెరిగి, తీవ్ర ఉక్కబోత పెరగడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. జనసంచారం లేక వ్యాపారులు కూడా మధ్యాహ్నం తమ షాపులను కట్టి వేస్తున్నారు.

విత్తనాల్లేకుండా నాట్లు ఎలా..

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వా పంట ఇంకా నెల రోజులకు గాని నాట్లు వేయడానికి రైతులు మొగ్గు చూపరు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే సమయానికి నారుమడులు వేయాలని అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ రైతులు మాత్రం జులై రెండోవారంలో గాని నాట్లు వేయడానికి ముందుకు రాని పరిస్థితి. రైతులకు మేలు చేసేందుకు వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని అధికారులు ఒక నెల రోజుల ముందు డబ్బా కొట్టి ప్రచారం చేస్తున్నారే తప్ప రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను ఎన్నడూ అందుబాటులో ఉంచని పరిస్థితి. కనీసం వేసవికాలంలో కూడా సీజన్‌కు సంబంధించి విత్తనాల గురించి ఏనాడూ అవగాహన కల్పించిన సందర్భాలు లేవని రైతులు విమర్శిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం జూన్ 15 నుంచి జులై 15 లోపు నారుమడులు, నాట్లు పూర్తి చేసుకోవాలని చెబుతున్నారు. ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో వరి నాట్లు పూర్తవుతాయని అధికారుల అంచనా. ఈ ఏడాది ఎంటియు 1312 విత్తనానికి రైతు ప్రాముఖ్యతను ఇస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పోడూరు

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జిన్నూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు జాన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి రామలక్ష్మణ్ పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం తాళాబత్తుల వీరభద్రకుమారి వేస్ట్ మెటీరియల్‌తో రకరకాల ఐటమ్స్ తయారీ గురించి విద్యార్థులకు నేర్పించారు. జిన్నూరు శాఖా గ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మూడు రోజులు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా ఏడో తేదీన పర్యావరణ పరిరక్షణ గురించి డ్రాయింగ్ పోటీలు, ఎనిమిదో తేదీన వ్యాసరచన పోటీలు, తొమ్మిదో తేదీన డిబేట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం ప్రథమ శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారంతో 28వ రోజుకు చేరుకున్నాయని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్(కాగితంపూవులు) ప్రదర్శించారు. విశ్రాంత మండల విద్యాధికారి ఎన్.సాల్మన్‌రాజు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. బాగా రాసినవారికి ఈ నెల 11వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులను పట్టణంలోని విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి విజ్ఞప్తి చేశారు. అనంతరం దేశ భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

పెనుమంట్ర : మార్టేరు వేణు గోపాల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా మానవత స్టేట్ కన్వీనర్ కోడూరి రాధ పుష్పవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో మేధా శక్తి పెరుగుతుందన్నారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్, జెడ్‌పిటిసి సభ్యులు కర్రీ గౌరి సుభాషిణి, మండల ప్రెసిడెంట్ చిర్ల శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి సభ్యులు అనురాధ, పెనుగొండ లక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలపై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మంచి విత్తనం అందుబాటులో తీసుకురావడం మంచి దిగుబడులకు సోపానం అవుతుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సోమవారం సంస్థలో సార్వా విత్తన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ మంచి నాణ్యమైన విత్తనం గురించి రైతాంగానికి అవగాహన కల్పించారు. రైతు ఎంచుకున్న ఏ విత్తనమైనా మూడు సంవత్సరాల వరకు మార్చనవసరం లేదన్నారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కొత్త మెరుపుగా ఇటీవల కాలంలో విడుదలైన వంగడాలను రైతులకు అందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, జోన్ విత్తన ఉత్పత్తి అధికారిణి డాక్టర్ వై.సునీత పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని కొత్తపేట గ్రామం చెక్ పోస్ట్ వద్ద చించినాడ బైపాస్ రోడ్డులో అక్రమంగా మచిలీపట్నం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు రవాణా అవుతున్న 20 టన్నుల పిడిఎఫ్ బియ్యాన్ని సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ స్వాధీనం చేసుకున్నారు. 6ఎ కేసు నమోదు చేసి బియ్యం రవాణా చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డిటి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆచంటలో ఈదురుగాలుల బీభత్సం

ఎగిరిపోయిన ఇళ్లపై రేకులు
విరిగిపడిన చెట్ల కొమ్మలు
నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మేఘవృతమై భారీ ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలో ఆచంట, కొడమంచిలి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి తదితర గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగి, పలు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్లు వాలిపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి నుంచి విద్యుత్ అధికారులు సిబ్బంది ఎంతో కష్టపడి సోమవారం మధ్యాహ్నం విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి.

రోడ్డుపై కూలిన చెట్టు

కొడమంచిలి పంచాయతీ పరిధి కుక్కలవారిపాలెంలో సానబోయిన శ్రీనివాస్ ఇటీవలే కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నాడు. ఆదివారం రాత్రి అకాల వర్షం, ఈదురుగాలులకు ఇంటిపై కప్పు ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ పరిశీలించి బాధితులకు భరోసా కల్పించి, ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కె.నరసింహరాజు పాల్గొన్నారు.


ఎగిరిపోయిన ఇంటిపై కప్పు

పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం

భీమవరంలో...

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీని ప్రారంభించారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంతి రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.సీతారామరెడ్డి, ఇంజినీరింగ్ ఎన్విరాన్మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వి.వాణిశ్రీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీనివాస్ అల్పాహారంగా విద్యార్థులకు ఇచ్చిన పనస తొనలులోని గింజలను తీసి పిల్లలకు "సీడ్ బాల్స్ "తయారు చేయడం నేర్పారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందినవారికి ప్రశంసాపత్రాలు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కన్వీనర్ రామనాగేశ్వరరావు, లక్ష్మి, అప్ కాస్ట్ రిసోర్స్ పర్సన్ తోట సతీష్, మృదుల, కృష్ణ, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవాదికారా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎ.అనురాధ అధ్యక్షతన నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సురేష్ బాబు మాట్లాడారు. 2023 సంవత్సరాన్ని 50వ పర్యావరణ దినోత్సవాన్ని బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో ప్రపంచంలో అన్ని సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. 1973లో జూన్ 5న మొదటిసారి పర్యావరణ దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ అనురాధ మాట్లాడుతూ ప్లాస్టిక్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారిందన్నారు. కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్‌బాబు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.సుధీర్, లోక్ అదాలత్ సభ్యులు వివి.సుబ్బారావు, వి.కరుణాకరరావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్, వైస్ ప్రిన్సిపల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, సిబ్బంది, విద్యార్థులు, హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ పాల్గొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్, భీమవరం వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సృజన వాటికలో మొక్కలు నాటారు. అనంతరం సిఎస్‌సి హెచ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మల్లికృష్ణంరాజు, ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని, భీమవరం వాసవి క్లబ్ అధ్యక్షులు మానేపల్లి చిన్నారావు, డాక్టర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గణపవరం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వైసిపి నాయకులు కాకర శ్యామ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఐవి.రాజు, హెచ్‌వి టివి.సుబ్బలక్ష్మి, ఎఎన్ఎం అన్నకుమారి, ఆరోగ్య సహాయకులు నామాల రాజు తెలిపారు. కాలుష్య నివారణకు మొక్కలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.సంతోష్‌నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యఅభివృద్ధి సంస్థ సహకారంతో కాలేజి ఆవరణలో 15 మొక్కలు నాటినట్లు చెప్పారు వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కిరాజు, డివివి.చినసత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం టౌన్‌లో..

ఆచంట : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొడమంచిలి పంచాయతీలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో మొక్కలను పెంపకాన్ని బాధ్యతగా ప్రతిపౌరుడు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రేవతి, ప్రియదర్శిని, ఎఎన్ఎం పుష్పరాజ్యం, డిఎ రవీంద్ర బాబు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉండి : ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఉండి కెవికెలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక శ్రీ వైఎన్ కళాశాల, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ - ఇండియా భీమవరం విభాగం సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎపివి.అప్పారావు, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ - ఇండియా, భీమవరం బ్రాంచ్ ఉపాధ్యక్షులు వలవల రవీంద్రనాథ్ మాట్లాడారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.కనకారావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ యాకోబ్, విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ, నరసాపురం బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నరసాపురం కోర్టు ప్రాంగణంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కామన బాల సత్యనారాయణ, న్యాయవాదులు సిహెచ్.దానయ్యానాయుడు, పి.శ్రీనివాసరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, వల్లభరావు, నరసింహరాజు, ఆనందబాబు, నగేష్ పాల్గొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నరసాపురం గ్రంథాలయం లైబ్రేరియన్ కుమారి అధ్యక్షతన సనార ఫౌండేషన్ ఛైర్మన్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి శిరిగినీడి మొక్కలను నాటడంతో పాటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి, ప్రముఖ రచయిత చేగొండి సత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ చినమిల్లి శ్రీనివాసరావు, తోట శ్రీనివాస్, భట్టిప్రోలు సత్యనారాయణ, సూర్యం బాబు, సుధీర్ మోహన్, ప్రిన్స్ ప్రవీణ్, జీవన్‌కుమార్, భూషణ్, ఎన్.విక్టర్‌రాజు

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ గురించి నినాదాలు చేశారు. కళాశాల నుంచి గాంధీ బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరవాసరం : పర్యావరణ పరిరక్షణలో చెట్లు కీలక పాత్ర వహిస్తాయని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం ఎఫ్ఎంసి పురుగు మందుల కంపెనీ ఆధ్వర్యంలో పలు పంచాయతీల వద్ద మొక్కలు నాటారు. వీరవాసం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ శేషు, సేల్స్ ఆఫీసర్ శివకృష్ణ, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా నెహ్రూ యువ కేంద్ర సంగథన్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర క్రీడల యువజన అధికారి డి.కిషోర్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థుల మంచి ఆహార అలవాట్లు ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల సిరిధాన్యాలపై అవగాహన కల్పించి కళాశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సల్మాన్‌బాషా, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విద్యార్థులు, ఎన్‌వైకె వాలంటీర్లు లక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం సమతౌల్యంగా ఉండాలంటే మొక్కలు విరివిగా పెంచాలన్నారు.

కాళ్ల : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించాలని కాళ్ల వైద్యాధికారి డాక్టర్ ఎం.గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వి.వి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా దుంపగడప వి.వి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుజాత ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు సిహెచ్.హరినాథ్, కె.ఆనందకుమార్, కె.బాలగురవయ్య, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

అగ్రికల్చరల్ అధికారిగా అబ్దుల్‌రహీం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు అగ్రికల్చరల్ అధికారిగా అబ్దుల్ రహీం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటేషన్‌పై వచ్చిన ఎం.సుజాత తిరిగి అనంతపురం బదిలీ అయ్యారు.

పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె పాదుషా కోరారు. మండలంలోని నడిపూడి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సోమవారం పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్స్ వంటి సౌకర్యాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రత్నరాజు పాల్గొన్నారు.

'స్పందన'కు పలు వినతులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలను సబ్ కలెక్టర్ సూర్యతేజ స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళలు నాయకత్వం చేపట్టాలి

లయన్స్ ప్రమాణస్వీకార సభలో ఎంఎల్‌సి రవీంద్ర

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలు నాయకత్వ పోటీల్లో ముందుకు రావాలని లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం స్థానిక లయన్స్ వి కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎండి అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తొలుత ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం మోటుపల్లి శ్రీనివాసరావు బృందం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ ఆల్ ఇండియా డైరెక్టర్ చిలువూరి కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు క్లబ్‌లో నూతనంగా చేరిన 14 మంది మహిళలు, ఏడుగురు పురుషులు మొత్తం 21 మందికి లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ స్థానిక వైద్య ప్రముఖులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు ప్రమాణం చేయించారు. 2023-24 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గట్టిం మాణిక్యాలరావు నూతన క్లబ్ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

త్వరలో నరసాపురం సంక్షేమ పరిషత్ సంఘం ఏర్పాటు

నరసాపురం టౌన్ :అభివృద్ధి, సంక్షేమాన్ని ఆకాంక్షించే సేవా తత్పరులు, ఆ భావాలు కలిగిన దాతలను కలుపుకుని పట్టణంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నరసాపురం సంక్షేమ పరిషత్ సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బొమ్మిడి కృష్ణంరాజు ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ఆక్వా రంగ నిపుణులు బొమ్మిడి రవి శ్రీనివాస్ (ఆర్‌కె శ్రీను) వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ఈ సంస్థ నిర్వహణ చేయాలనే తలంపుతో విద్యావంతులు, మేధావులు, యువకులు, మహిళలు, కార్మికులు, న్యాయవాదులు సభ్యులుగా దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని చెప్పారు. పాత్రికేయుల సూచనలు, సలహాలతో సమాజంలో సేవలందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్న ఆలోచనతోనే నరసాపురం సంక్షేమ పరిషత్ సంఘ ఆవిర్భావానికి శ్రీకారం చుట్టానని తెలిపారు.

వరదరాజపురం సర్పంచి మృతి

ప్రజాశక్తి - గణపవరం

నరసింహమూర్తి (ఫైల్)

మండలంలో వరదరాజపురం గ్రామ సర్పంచి కొండేటి నరసింహమూర్తి (40) సోమవారం ఉదయం మృతి చెందారు. నరసింహమూర్తి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో గుంటూరు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) గుంటూరు ఆసుపత్రికి వెళ్లి నరసింహమూర్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్స పొందుతున్న నరసింహమూర్తి ఆరోగ్యం మెరుగు పడి త్వరలో మళ్లీ గ్రామానికి వస్తారని కుటుంబసభ్యులు ఆశించారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన అకాల మృతికి ఎంఎల్ఎ వాసుబాబు, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు చనుమూరి లక్ష్మీభవానిశివప్రసాద్, వైసిపి మండల నాయకులు సంతాపం తెలిపారు.

బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని వార్డెన్ ఎంవి.సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసిలకు సంబంధించి 80 ఖాళీలు ఉన్నాయన్నారు.

ఒఆర్ఎస్ కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - వీరవాసరం

వేసవిలో వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు ఒఆర్ఎస్ కేంద్రాలను వినియోగించుకోవాలని సర్పంచి చికిలే మంగతాయారు కోరారు. వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఒఆర్ఎస్ కేంద్రాన్ని సర్పంచి సోమవారం ప్రారంభించారు. ఐడిసిఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఒఆర్ఎస్ కేంద్రాలను గ్రామంలో వివిధ ప్రాంతాల్లో, అంగనవాడీ సెంటర్‌లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎఎన్ఎం తెలిపారు. చిన్నపిల్లలకు అవసరమైన ఐరన్ మాత్రలను ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ధాన్యం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కోరారు. ధాన్యాన్ని స్వయంగా ఆయన సోమవారం తూకం వేసి బరువు చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 41 కేజీలు ఉండాల్సిన ధాన్యం కట్ట 44 కేజీలు వచ్చిందన్నారు. కట్టక మూడు కేజీలు అదనం అంటే బస్తాకు ఎనిమిది కేజీల చొప్పున రైతులను దోచేస్తు న్నారన్నారు. ఏరువాక పౌర్ణమి రోజున ఖరీఫ్ పంటకు ఏరువాక ప్రారంభించాల్సిన రైతు గత పంట ధాన్యం అమ్ముకోవడానికి రైస్ మిల్లుల ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాడన్నారు. ఇప్పటికైనా ధాన్యం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాపవరంలో అల్లూరి జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని కాపవరం గ్రామంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విప్లవవీరుడు, తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు 125వ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామానాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో వెన్ను చూపని మహావీరుడు, ఎందరికో స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి భరతనాట్యాలు ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, జిఎస్ఎన్.రాజు, ఆగర్రు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, వేంపాడు గ్రామం కాపురస్తులు కొండేటి వెంకటేశ్వరరావు గారి కుమారుడు కొండేటి రాజేష్ అను నా యొక్క పాస్‌పోరును జిరాక్సు నిమిత్తం కాళ్ళ మోటారు సైకిల్‌పై వెళ్ళు తుండగా మార్గమధ్యలో పడిపోయినది. నా యొక్క **పాస్‌పోర్టు నెం. S9267516.** ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

కొండేటి రాజేష్
తండ్రి: వెంకటేశ్వరరావు, వేంపాడు గ్రామం, కాళ్ళ మండలం, ప.గో.జిల్లా.
సెల్: 91217 16702

డాక్యుమెంట్స్ పోయినవి

నా పేరు పెనుమత్స నాగలక్ష్మి, భర్త: B.S.V.S.N. రాజు అను నేను మా బంధువులైన గణపవరం గ్రామంలో పెళ్లికి వెళ్ళాము అక్కడనుండి పిప్పర గ్రామంలో మా బంధువులు ఇంటికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా నాకు సంబంధించి విశాఖపట్నం జిల్లా, చిన్నగదిల మండలం అడవివరం గ్రామంలో డాక్యుమెంట్ నెంబర్ 2968/1993 సంబంధించిన డాక్యుమెంటు మరియు బెంగుళూరు రూరల్ నేలమంగళ తాలూకా అరలసంద్ర మరియు గోవిందపురే అను గ్రామాల్లో సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ I7686/2004 to 2005 అను రెండు డాక్యుమెంట్లు ఉన్న బ్యాగు మార్గ మధ్యలో పడిపోయినది కావున దొరికిన వారు కింద ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలెను.

పెనుమత్స నాగలక్ష్మి
భర్త: P.B.S.V.S.N. రాజు,
గణపవరం.
సెల్: 94401 33333